క్లుప్తంగా

సీఎం జగన్‌తోనే సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

లింగపాలెం: సంక్షేమ పథకాలు పారదర్శకంగా పేదలకు చేరాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు అన్నారు. యడవల్లి గ్రామంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పేదల సమస్యలు తెల్సిన జగనన్న అనేక సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేశారన్నారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ అన్నవనేని శాంతరావు, మందలపు నరిశింహరావు, గణేష్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం పరిశీలన



తడిసిన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరం, పట్టిసీమ, గూటాల, కొత్త పట్టిసీమ ప్రాంతాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ పీజీ బుచ్చిబాబు, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, తహసీల్దార్ బి.సుమతి, జెడ్పీటీసీ కలుం హేమ కుమారి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, మండల వ్యవసాయ శాఖాధికారి ఎం.రాంబాబు, వ్యవసాయ సలహామండలి చైర్మన్ దత్తి రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు బండారు అప్పారావు, సొసైటీ సెక్రటరీ కారిపిరెడ్డి రాంబాబు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. తడిసిన ధాన్యాన్ని లారీల మీద మిల్లర్లకు తరలించే పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు.

ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి



తడిసిన ధాన్యం గింజలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారులు

కామవరపుకోట: తుపాను ప్రభావంతో తడిసిన ధాన్యానికి ఉప్పు ద్రావణం 5శాతం పిచికారీ చేస్తే మొలకెత్తకుండా ఉంటాయని మండల వ్యవసాయ అధికారి సి.పవన్ కుమార్ తెలిపారు. మండలంలో ముంపునకు గురైన వరి పంటలను, కల్లాల్లో ధాన్యం రాశులను బుధవారం ఆయన పరిశీలించారు. కళ్ళచెరువు, రావికంపాడు, కామవరపుకోట, వడ్లపట్ల, నూతనం గ్రామాలలో ముంపునకు గురైన వరి, గోధుమ, మొక్కజొన్న, పత్తి పంటలను పరిశీలించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



వరదనీటిలో నానుతున్న వరి పనలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి

జంగారెడ్డిగూడెం: మండలంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి బుధవారం పర్యటించి దెబ్బతిన్న పొలాలను, ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేరంపేటలో 20 ఇళ్లు నీటమునిగాయని, వేగవరంలో 16, గుర్వాయిగూడెంలో 15 ఇళ్లు దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న పంటలకు సంబంధించి వ్యవసాయ శాఖ జేడీతో మాట్లాడి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరామన్నారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజన్ పరిధిలో విద్యుత్ పునరుద్ధరణ పనులు అధికారులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. డివిజన్ మొత్తంలో సుమారు రూ.13 లక్షల నష్టం సంభవించినట్లు విద్యుత్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. డివిజన్ పరిధిలో 11 కేవీ విద్యుత్ స్తంభాలు 94 కూలిపోయినట్లు చెప్పారు. అలాగే 6 ఎల్‌టీ లైన్ స్తంభాలు, 6 ట్రాన్స్‌ఫార్మర్‌లు దెబ్బతిన్నాయన్నారు. వ్యవసాయ విద్యుత్‌కు సంబంధించి పొలాల్లో ఇబ్బందుల దృష్ట్యా వాటిని కూడా అధిగమించి పునరుద్ధరిస్తామని చెప్పారు. డీఈ పి.రాధాకృష్ణ, ఏడీఈ ఈ.సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు. విద్యుత్ పునరుద్ధరణ కోసం శ్రమించి పరిస్థితి చక్కబెట్టేంత వరకు అధికారులు క్షేత్రస్థాయిలో ఉన్నారు.

శిబిరాన్ని పరిశీలించిన చైర్‌పర్సన్

జంగారెడ్డిగూడెం: మిచౌంగ్ తుపాను కారణంగా కురిసిన వర్షాలతో పట్టణంలోని సీతామహాలక్ష్మి స్వచ్ఛంద సేవా సంస్థ వృద్ధాశ్రమం ముంపునకు గురైన విషయం తెలిసిందే. మంగళవారం రాత్రి వృద్ధులకు స్థానిక చంద్రశేఖర మినీ ఫంక్షన్ హాల్‌లో ఆశ్రయం కల్పించారు. ఈ నేపథ్యంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, కౌన్సిల్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు శిబిరాన్ని పరిశీలించారు.



ద్వారకాతిరుమల: రాజుపాలెం వద్ద వరద నీటిలో కొట్టుకుపోయిన ప్రధాన రహదారి



బుట్టాయగూడెం: మర్లగూడెం అటవీ ప్రాంతంలో నేలకొరిగిన వృక్షాన్ని తొలగిస్తున్న దృశ్యం



కొయ్యలగూడెంలో: సత్యసాయిబాబా ఆలయం వద్ద కూలిన రావి వృక్షం



లింగపాలెం: తోచలకరాయిడుపాలెంలో పడిపోయిన పచ్చిమిర్చి పైరును పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ముంచేసిన తుపాను

- నీట మునిగిన వరి, పత్తి, పొగాకు, మినుము, వేరుశనగ పంటలు
- మన్యంలో కూలిన పలు ఇళ్లు, చెట్లు, విద్యుత్ స్తంభాలు
- పంట నష్టాలను పరిశీలించిన అధికారులు

బుట్టాయగూడెం: మిచాంగ్ తుపాను బీభత్సం సృష్టించింది. పంట పొలాలను ముంచెత్తింది. గిరిజన ప్రాంతంలో కొండ కాల్వలు పొంగిపొర్లాయి. భారీ వృక్షాలు నేలకొరిగాయి. అలాగే పలు ప్రాంతాల్లో ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. అప్రమత్తమైన అధికారులు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. నీట మునిగిన చేలను పరిశీలించారు. అదేవిధంగా కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించి ఆ ధాన్యాన్ని ఆర్‌బీకేలకు తరలించాలని రైతులకు సూచించారు. మర్లగూడెం సమీపంలోని అటవీప్రాంతంలో భారీ చింతచెట్టు రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. అటవీశాఖ అధికారులు ఆ వృక్షాన్ని తొలగించారు. అదేవిధంగా రాజానగరంలో రహదారిపై పడిపోయిన వృక్షాలను గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, గ్రామస్తులు తొలగించారు. గాలివానకు పడిపోయిన విద్యుత్ స్తంభాలను విద్యుత్ శాఖ అధికారులు పునరుద్ధరించారు. ఇదిలా ఉండగా పోలవరం నియోజకవర్గ పరిధిలో 61 గ్రామాల పరిధిలో ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు 8,432 ఎకరాల్లో తుపాను ప్రభావం వల్ల నష్టం వాటిల్లినట్లు కేఆర్‌పురం ఐటీడీఏ వ్యవసాయశాఖ సంచాలకులు బుచ్చిబాబు తెలిపారు. వీటిలో వరి 3,227 ఎకరాలు, మొక్కజొన్న 1,137 ఎకరాలు, మినుములు 76 ఎకరాలు, వేరుశనగ 413 ఎకరాలు, పొగాకు 2064 ఎకరాలు, ప్రత్తి 1515 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు తెలిపారు. అన్నారు. అదేవిధంగా ఇప్పటివరకూ 46 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 7052 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అలాగే 1532 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని చెప్పారు.

రైతులకు కోలుకోలేని దెబ్బ

కుక్కునూరు: మిచాంగ్ తుపాను మండలంలోని రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. కుక్కునూరు-దాచారం మధ్య గల గుండేటి వాగు వంతెన వరద ప్రవాహానికి కోతకు గురైంది. వరదకు కొట్టుకు వచ్చిన భారీ వృక్షాలు వంతెనకు అడ్డుపడడంతో స్థానిక సర్పంచ్ రావు మీనావినోద్, తహసీల్దార్ డీ ఎల్ ప్రమద్వరల ఆధ్వర్యంలో వెంటనే సహాయక చర్యలను ముమ్మరం చేశారు. కోతకు గురైన ప్రదేశాన్ని గ్రావెల్‌తో నింపడంతో పాటు వంతెనకు అడ్డుపడిన భారీ వృక్షాలను కట్టింగ్ మిషన్‌తో కోయించి వాటిని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. చేలకు నీరందించేందుకు రైతులు వాగులో ఏర్పాటు చేసుకున్న 10 ఇంజిన్ మోటార్లు వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి. మండలంలో వేలాది ఎకరాల్లో పత్తి, మిరప పంటలు దెబ్బతిన్నాయి. ఈదురు గాలుల దాటికి చెట్లు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. వరద నీరు లోతట్టు ప్రాంతాలలోని ఇళ్లను చుట్టుముట్టడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

నీటమునిగిన పంటలు... నష్టపోయిన రైతులు

లింగపాలెం: తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలో వరి, పచ్చిమిర్చి, పొగాకు, మొక్కజొన్న, ఉద్యాన పంటలు తడిసి పడిపోవటంతో రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. దెబ్బతిన్న పంటలను మంగళవారం మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొఠారి మోహన్ తదితరులు పరిశీలించి రైతులకు ధైర్యాన్ని చెప్పారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులను తప్పకుండా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

ఈదురుగాలులతో బీభత్సం

కొయ్యలగూడెం: మిచాంగ్ తుపాను ప్రభావంతో వీచిన ఈదురుగాలులకు కొయ్యలగూడెంలోని పోలవరం రోడ్డులో భారీ వృక్షాలు నేలకు ఒరిగాయి. సత్యసాయిబాబా గుడి వద్ద పూజలు అందుకునే రావి వృక్షం కూలడంతో భక్తులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ వద్ద మొదలుకొని మిషనరీ హాస్పిటల్ వరకు, గణేష్ సెంటర్ వరకు ఇరువైపులా హోర్డింగ్‌లు, చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. నష్టం పై అంచనాలు సిద్ధం చేస్తున్నామని, కొన్ని గ్రామాలలో ఇళ్లు దెబ్బతిన్నట్లు తహసీల్దార్ పి.నాగమణి తెలిపారు. శివాలయం సమీపంలోని షెడ్డు కూలడంతో అందులో నివసిస్తున్న పరువురికి గాయాలైనట్లు ఆమె చెప్పారు.

కల్లోలం సృష్టించిన మిచాంగ్ తుపాను

ద్వారకాతిరుమల: మిచాంగ్ తుఫాన్ కల్లోలాన్ని సృష్టించింది. ఈదురు గాలులు, వర్షం దాటికి మండలంలోని పలు రహదారులు జల దిగ్బంధమయ్యాయి. అలాగే వరి, మొక్కజొన్న, అరటి, వేరుసెనగ తదితర పంటలు నీటమునిగాయి. దాంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ద్వారకాతిరుమల నుంచి భీమడోలుకు వెళ్లే ప్రధాన రహదారిలోని గొల్లగూడెం వద్ద వరదనీరు రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తోంది. పొలాలు, రహదారి నీటి ప్రవాహంతో ఏకమై కలువను తలపిస్తోంది. దాంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానికులు జేసీబీ సహాయంతో నీటిని మళ్లించారు. ఆ ప్రాంతంలో ఉన్న మొక్కజొన్న, అరటి తోటలు నీటి ప్రవాహానికి దెబ్బతిన్నాయి. అలాగే ద్వారకాతిరుమల నుంచి రాజుపాలెంకు వెళ్లే రహదారి మధ్యలో పూర్తిగా కొట్టుకుపోయింది. దాంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పి.కన్నాపురం, ఎం.నాగులపల్లి, బుట్టాయిగూడెం గ్రామాల్లో వరి పంటలు, ధాన్యం రాసులు నీటమునిగాయి. గుండుగొలను కుంటలో ద్వారకాతిరుమలకు చెందిన రైతు చిలుకూరి ధర్మారావుకు చెందిన రెండెకరాల మొక్కజొన్న, వరి పంటలు నీటమునిగాయి. అలాగే అరటి చెట్లు నేలకొరిగాయి. ధాన్యం తడిచి ముద్దయ్యింది. దేవినేనివారిగూడెంలో గుర్రాల వాగు మీద నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వాగుపైన రోడ్డు సైతం దెబ్బతింది.



బుట్టాయగూడెం: కృష్ణాపురం సమీపంలో తడిసిన ధాన్యాన్ని వ్యవసాయాధికారులకు చూపిస్తున్న రైతు



కుక్కునూరు: ఈదురుగాలుల ధాటికి కూలిన ఇంటి గోడ

పొంగిన వాగులు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలంలో భారీ వర్షంతో చేతికొచ్చిన పంటలు తడిసిముద్దయ్యాయి. ప్రాథమిక అంచనా ప్రకారం మండల వ్యవసాయాధికారి పోశారావు తెలిపిన వివరాల ప్రకారం రాశుల మీద 265 మెట్రిక్ టన్నుల ధాన్యం తడవగా, 450 ఎకరాల్లో వరి నేలవాలింది. 870 ఎకరాల్లో నీరు నిలిచిపోయింది. అలాగే 1170 ఎకరాల వర్జీనియా పొగాకు తోటల్లో నీరు నిలిచిపోగా, 130 ఎకరాల్లో నేలవాలింది. 300 ఎకరాల్లో మొక్కజొన్న తోటల్లో నీరు నిలిచిపోయింది. 72 ఎకరాల్లో కోసిన వేరుశనగ తడిసిపోగా, 42 ఎకరాల్లో పంటల్లో నీరు నిలిచిపోయింది. 24 ఎకరాల్లో మిర్చి తోటల్లో నీరు నిలిచిపోయింది. లక్కవరంలో రహదారి మీదుగా వెదుళ్ల వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జొన్నవారిగూడెంలో ఉన్న జల్లేరువాగు ఉధృతంగా ప్రవహించింది. పట్టెన్నపాలెంలో జల్లేరు వాగుపై నిర్మించిన డైవర్షన్ రహదారి వాగు ఉధృత్తికి కొట్టుకుపోయింది. మండలంలోని పేరంపేట, వేగవరం గ్రామాల్లో నీటి ముంపునకు గురైన, పొలాలను, ధ్వంసమైన గృహాలను జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి పరిశీలించారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలను తరలించి ఆహార సదుపాయాలను ఏర్పాటు చేశారు. లక్కవరంలో ఎంపీపీ కొదమ జ్యోతి, గురవాయిగూడెంలో ఎంపీటీసీ కొయ్య రమారెడ్డి పరిశీలించారు. చిన్నంవారిగూడెంలో చిన్నా-పెద్దా చెరువు డ్యాం గట్టు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో చెరువులోకి చేరిన వరద నీరంతా సమీప ప్రాంతాల్లోని చెరకు, పొగాకు, వరి పొలాలను ముంచెత్తింది. కొంగువారిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయం ఉగ్రరూపం దాల్చింది. ఇన్‌ఫ్లో 20వేల క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరుతుండగా డ్యాం నాలుగు గేట్లను ఎత్తి గంటకు 2,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడుతునట్లు ఇరిగేషన్ శాఖ ఏఈ భాస్కరరావు తెలిపారు. జలాశయం పూర్తి నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 83.40 మీటర్లు ఉన్నట్లు తెలిపారు. జిల్లాల్లో దక్షిణ ముఖ కాశీగా పేరు గాంచిన తాడువాయి శ్రీభద్రకాళి సమేత వీరేశ్వరస్వామి వారి క్షేత్రాన్ని వరద నీరు ముంచెత్తింది. ఎర్రకాలువ జలాశయం ఒడ్డున ఈ క్షేత్రం ఉండటంతో ఎగువ ప్రాంతం వచ్చిన వరద నీరు జలాశయంలోకి పోటెత్తడంతో శైవక్షేత్రంలోకి నీరు చేరింది. ఆలయ పరిసరాలతో పాటు, స్వామి వారి గర్భగుడిలో నీరు చేరి స్వామి, అమ్మవార్ల విగ్రహాలు సగానికి పైగా నీటిముంపునకు గురయ్యాయి. వరద ముంపును సైతం లెక్కచేయకుండా అర్చకులు కాళ్లకూరి రవికుమారాచార్యులు క్షేత్రంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు.



లక్కవరంలో రహదారి మీదుగా ప్రవహిస్తున్న వెదుళ్ల వాగు



చిన్నవారిగూడెంలో డ్యాం తెగిపోవడంతో పొలాలను ముంచెత్తుత్తున్న వరద నీరు



లక్కవరంలో పంటలను పరిశీలించిన ఎంపీపీ జ్యోతి

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తాం



చింతలపూడిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు ధైర్యం చెబుతున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి: రైతులు అధైర్య పడవద్దని తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ప్రకటించారు. మండలంలోని ప్రగడవరం గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం అందించడానికి చర్యలు తీసుకుంటానన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రకాల్వ

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మేడవరపు చెరువు అలుగు పారుతుంది. దీంతో ఎర్రకాల్వ ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలో బుధవారం ఉదయానికి 235.4 మి మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాలకు చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. బుధవారం సాయంత్రానికి జలాశయం నీటిమట్టం 344 అడుగులకు చేరుకున్నట్లు తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ యు పరమానందం తెలిపారు. ప్రస్తుతం ఎగువ తెలంగాణా ప్రాంతం నుండి ప్రాజెక్టుకు 13 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్లు చెప్పారు. మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రగడవరం, యర్రగుంటపల్లి, రేచర్ల, సీతానగరం గ్రామాల్లో వరిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. వేరుశనగ, పొగాకు, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. తహసీల్దార్ కృష్ణజ్యోతి మండలంలో పర్యటించారు. నష్టం అంచనా వేస్తున్నట్లు చెప్పారు.

దివ్యాంగుడికి సాయం

చింతలపూడి: ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో అజీమ్ ఛారిటీ ప్రతినిధులు చింతలపూడికి చెందిన షేక్ ఖాసిం అనే దివ్యాంగుడు నెలకు సరిపడా నిత్యావసరాలను, బియ్యాన్ని బుధవారం అందజేశారు. అజీమ్ ఛారిటీ ఫౌండర్ షేక్ అజాద్ మాట్లాడుతూ ఏపీయూడబ్ల్యూజే ప్రెసిడెంట్ కేపీకే కిషోర్, కార్యదర్శి బీకే కిషోర్‌ల నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు.

మన్యంలో అధికారుల పర్యటన



బుట్టాయగూడెం: జల్లేరు జలాశయం వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న పీఓ సూర్యతేజ



కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు తోటలను పరిశీలిస్తున్న ఆర్ఎం, ఎఎస్



టి.నరసాపురం: బందంచర్లలో దెబ్బతిన్న పొగాకు పంటను పరిశీలిస్తున్న వాసిరెడ్డి మధు తదితరులు

బుట్టాయగూడెం: ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ బుధవారం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బుట్టాయగూడెం మండలం రాజానగరం గ్రామాన్ని సందర్శించి అక్కడ గాలి దుమారం వల్ల మృతి చెందిన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అదేప్రాంతంలో దెబ్బతిన్న ఇళ్లు, ప్రహరీలను పరిశీలించారు. అలాగే మండలంలోని దొరమామిడి సమీపంలో ఉన్న గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయాన్ని సందర్శించారు. అక్కడ నీటి నిల్వ పరిస్థితిని ఇరిగేషన్ శాఖ అధికారి ఎమ్ఐ డీఈ పి. ఆనంద్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీఓ సూర్యతేజ మాట్లాడుతూ జలాశయం వద్ద అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అలాగే దొరమామిడి సమీపంలో రోడ్లకి అడ్డంగా చెట్లు కూలిపోవడంతో వాటిని తొలగించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అనంతరం జీలుగుమిల్లి మండలం కామయ్యకుంట సమీపంలోని వాగులో యువకుడు గల్లంతైన ప్రదేశానికి చేరుకుని అక్కడి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వర్జీనియా తోటలను పరిశీలించిన అధికారులు

కొయ్యలగూడెం: మిచాంగ్ తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలు పొగాకు పంటపై ప్రభావం చూపిస్తున్నాయని పొగాకు బోర్డు అధికారులు, శాస్త్రవేత్తల సూచనల పాటించి నష్టాన్ని నివారించవచ్చని పొగాకు బోర్డు ఆర్ఎం ఆదిశేషయ్య పేర్కొన్నారు. కొయ్యలగూడెం కేంద్రం నిర్వహణ అధికారి గ్రేసీ మార్గరేట్‌తో కలిసి బుధవారం దెబ్బతిన్న పొగాకు తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం బోర్డ్ పరిధిలోని రైతులతో మాట్లాడారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

టి.నరసాపురం: తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి మధు అన్నారు. మండలంలోని బందంచర్ల గ్రామంలో దెబ్బతిన్న పంట పొలాలను బుధవారం ఆయన పరిశీలించారు. మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. పలు రహదారుల్లో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధానంగా టి.నరసాపురం ఆంధ్రాబ్యాంకు సమీపంలో రోడ్డుపై 4 అడుగులకు పైగా వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అలాగే టి.నరసాపురం మక్కినవారిగూడెం గ్రామాల మధ్య చింతల వాగు పొంగి పొర్లుతుండటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

జంగారెడ్డిగూడెం ఎస్‌హెచ్‌వోగా ట్రైనీ డీఎస్పీ



జంగారెడ్డిగూడెం డీఎస్పీ ధనుంజయుడిని మర్యాదపూర్వకంగా కలిసిన ట్రైనీ డీఎస్పీ బి.విద్య

జంగారెడ్డిగూడెం: ట్రైనింగ్‌లో భాగంగా జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా ట్రైనీ డీఎస్పీ బీ.విద్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం డీఎస్పీ ధనుంజయుడిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను ఆమె అందజేశారు. 2022 బ్యాచ్‌కు చెందిన బి.విద్య ఏలూరు జిల్లాకు ట్రైనింగ్ నిమిత్తం వచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఉత్తర్వులు మేరకు ఏలూరు వన్‌టౌన్‌లో పీసీగా, టూ టౌన్‌లో హెచ్‌సీగా, త్రీ టౌన్‌లో రైటర్‌గా విధులు నిర్వహించారు. శిక్షణలో భాగంగా జంగారెడ్డిగూడెం ఎస్‌హెచ్‌వోగా ఆమె రెండు నెలల పాటు విధులు నిర్వహించనున్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: భారత రాజ్యాంగ నిరాత్మ డా.బీఆర్ అంబేడ్కర్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెంలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద, జగజ్జీవన్ నగర్‌లో అంబేడ్కర్‌కు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి, పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య, జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్ పాల్గొన్నారు.

కామవరపుకోట: మండలంలో అంబేడ్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తడికలపూడిలో జెడ్పీటీసీ కడిమి రమేష్ ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు అండగా నిలిచిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, సెక్రటరీ సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీనివాసపురంలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ద్వారకాతిరుమల: దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహోన్నతుడు బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని తహసీల్దార్ పి.సతీష్ అన్నారు. అంబేడ్కర్ 67వ వర్ధంతి కార్యక్రమాలు మండలంలోని పంగిడిగూడెంలో బుధవారం ఘనంగా జరిగాయి. తహసీల్దార్ సతీష్, ఎస్సై టి.సుధీర్ ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రతిపాటి యోహాను, గుమ్మడి శ్రీను, అంబేడ్కర్ యూత్ కమిటీ సభ్యులు సీహెచ్ భాస్కరరావు, మానుకొండ శ్రీను, గోగులమూడి సోమయ్య, కిషోర్, పవన్, సురేష్ పాల్గొన్నారు.

చింతలపూడి: దళితుల అభ్యున్నతికి డా బీఆర్ అంబేడ్కర్ చేసిన సేవలు మరువలేనివని పలువురు దళిత సంఘాల నేతలు కొనియాడారు. బుధవారం చింతలపూడి మండలంలో పలు రాజకీయ పార్టీలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో డా బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్ ,ఫైర్ స్టేషన్ సెంటర్ , బోయగూడెం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు దళిత నేతలు, ఉద్యోగ సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాత చింతలపూడిలో పలు రాజకీయ, కార్మిక సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పోలవరం డివిజన్
9951602915 (పోలవరం)
9505508399 (చింతలపూడి)

Office mail : tpgadvt@gmail.com